ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7 । కనిష్ఠం 21.6
కామారెడ్డి జిల్లా వార్తలు
5
గురువారం 1 ఆగస్టు 2024



విద్యార్థులకు అభ్యాసన ఫలితాలను మెరుగుపరచాలి

కామారెడ్డి టౌన్, జూలై 31: విద్యార్థులకు అభ్యాసన ఫలితాలను మెరుగుపరచాలని ఎంఈవో ఎల్లయ్య ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జాతీయ సాధన సర్వేలో భాగంగా చిన్నమల్లారెడ్డి గ్రామంలో కామారెడ్డి మండలానికి చెందిన ఉపాధ్యాయులకు రెండోరోజు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం ద్వారా ఎన్ఏఎస్‌లో మన జిల్లాను ముందంజలో నిలపాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లుగా ప్రమీల, శృతి, రజని, మహేష్‌లు పాల్గొన్నారు.



రైతన్నకు రుణ విముక్తి

- రుణమాఫీతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు
- రెండు విడతల్లో పూర్తయిన రుణమాఫీ ప్రక్రియ
- ఇక మిగిలింది మూడో విడత మాత్రమే
- రెండో విడతలో 25,556 మంది లబ్ధిదారులు
- రూ.లక్షన్నర లోపు ఉన్న రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బుల జమ
- జిల్లాలో మొదటి, రెండు విడతల్లో మొత్తం 74,356 మందికి రుణమాఫీ
- రూ.443.33 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కామారెడ్డి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు రుణవిముక్తి కల్పిస్తుండడంతో జిల్లా అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో ఇప్పటికే రెండు విడతల్లో మాఫీ ప్రక్రియ పూర్తి చేశారు. రెండు విడతల్లో రుణమాఫీతో జిల్లాలో 74,356 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.443.33 కోట్లు రుణమాఫీ నిధులను జిల్లాకు విడుదల చేసింది. రెండో విడత రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ నిధులను విడుదల చేస్తున్నప్పటికీ అర్హులైన రైతుల ఖాతాలో నిధులు వెంటనే జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ, బ్యాంక్ అధికారులు రైతులకు భరోసానిస్తు ఖాతాలో మాఫీ డబ్బులు జమ అవుతాయంటూ చెబుతున్నారు.

రెండో విడతలో 25,556 మంది అర్హులు

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించగా సీఎం రేవంత్‌రెడ్డి హామీని నెరవేర్చనున్నారు. రెండో విడత రుణమాఫీ నిధులను లబ్ధిదారుల రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. లబ్ధిదారుల రైతుల వివరాలను జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 22 మండలాల వారిగా రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాల జాబితాను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో 25,556 మంది రైతులు పంట రుణాల మాఫీకి లబ్ధిదారులుగా గుర్తించారు. అయితే మద్నూర్ మండలంలో అత్యధికంగా 1,871 మంది లబ్ధిదారులు ఉండగా, అత్యల్పంగా లింగంపేటలో మండలంలో 571 మంది ఉన్నారు. బీర్కూర్‌లో 1016 మంది లబ్ధిదారులు ఉండగా, గాంధారి 1576, బీబీపేట 1005, బాన్సువాడ 1295, జుక్కల్‌లో 1386, కామారెడ్డి 900, మాచారెడ్డి 1688, బిచ్కుంద 1597, నాగిరెడ్డిపేట 1003, నస్రూల్లాబాద్ 679, నిజాంసాగర్ 947, పెద్దకొడప్‌గల్ 590, రాజంపేట 924, రామారెడ్డి 887, సదాశివనగర్ 1335, తాడ్వాయి 1168, ఎల్లారెడ్డి 957 రైతులను అర్హులుగా గుర్తించారు.

రూ.211.72 కోట్ల రుణమాఫీ

2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు 5 ఐదేళ్ల కాలంలో రైతులు తీసుకున్న రూ.2లక్షల వరకు రుణాన్ని మూడు విడతల్లో మాఫీ కానుంది. అయితే రెండో విడత కింద ప్రభుత్వం లక్షన్నరలోపు రుణమాఫీ చేయనున్నందున అర్హులైన రైతుల వివరాలను విడుదల చేసింది. జిల్లాలో 25,556 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉన్నారని జిల్లా వ్యవసాయశాఖ వివరాలను వెల్లడించింది. వీరందరికీ రెండో విడతలో లక్షన్నర చొప్పున రుణం మాఫీ కానుంది. ఈ లెక్కన రూ.211.72 కోట్ల రుణమాఫీ నిధులను ప్రభుత్వం ఆయా రైతుల ఖాతాలో జమ చేయనుంది. ప్రాథమిక సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార కేంద్ర తదితర బ్యాంకుల పరిధిలో రైతులు రుణాలు తీసుకున్నారు. ఈ బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ కానుంది.

రెండు విడతల్లో 74,356 మంది రైతులకు రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో రుణమాఫీ చేపట్టింది. ఈ రెండు విడతల్లో జిల్లాలో మొత్తం 74,356 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. ఈనెల 18న మొదటి విడత రుణమాఫీ చేపట్టగా అందులో జిల్లాలో 49,540 మంది అర్హులైన రైతుల జాబితాను విడుదల చేశారు. వీరికి గాను రూ.231.61 కోట్లు నిధులను ఆయా రైతుల ఖాతాలో జమ చేశారు. రెండు రోజుల క్రితం రెండో విడత రుణమాఫీ చేపట్టింది. ఈ విడతలో జిల్లాలో 25,556మంది అర్హులుగా ప్రకటించారు. వీరికి రూ.211.72కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసి ఆయా రైతుల ఖాతాలో జమ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేసిన రెండు, మూడు రోజుల వరకు నిధులు ఆయా రైతుల ఖాతాలో జమ కావడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో రుణమాఫీ రైతుల పేర్లు ఉన్నప్పటికీ బ్యాంకులోకి వెళితే ఖాతాలో నిధులు జమకాక పోవడంతో అయోమయానికి గురవుతున్నారు. దీంతో వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులను సంప్రదిస్తున్నారు. అర్హులైన రైతులందరి ఖాతాలో మాఫీ డబ్బులు రెండు, మూడు రోజుల్లో జమ అవుతాయని భరోసా కల్పిస్తున్నారు.

సీఎంఆర్‌ను సెప్టెంబరు లోగా అందించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 31: 2023-24 ఖరీఫ్ పంట సీఎంఆర్ డెలివరీలు 50 శాతం కంటే తక్కువ డెలివరీ చేసిన మిల్లర్లను సెప్టెంబరు వరకు అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-24 యాసంగి పంట యొక్క సీఎంఆర్ డెలివరీ కూడా త్వరగా పూర్తి చేయాలని, 2022-23 ఖరీఫ్ సీఎంఆర్ డిఫాల్ట్ మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు ప్రభుత్వంకు బియ్యం రూపంలో గాని, నగదు రూపంలో గాని చెల్లించాలని ఆదేశించారు. లేకపోతె క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆస్తులు జప్తు చేస్తామన్నారు. నాయబ్ తహసీల్దార్‌లందరు తమ పరిధిలోని మిల్లులన్నింటిని ఫిజికల్ చేయాలని ఆదేశించారు. సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ గోదాములలోని ఎఫ్‌సీఐ బోధన్, కామారెడ్డి అధికారులను మిల్లర్ డెలివరీ చేసిన సీఎంఆర్ బియ్యాన్ని వేగవంతంగా అన్ లోడింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల అధికారి నిత్యానందం, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శేఖర్, నాయబ్ తహసీల్దార్, రైస్‌మిల్లర్స్ ప్రెసిడెంట్ లింగ తదితరులు పాల్గొన్నారు.


మురికి కాలువలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

డబుల్ బెడ్‌రూంల వద్ద సమస్యలను పరిష్కరిస్తాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి టౌన్, జూలై 31: డబుల్ బెడ్‌రూంల వద్ద సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీ డబుల్‌బెడ్‌రూం కాలనీని మరోసారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో చేపట్టాల్సిన పనులపై కాలనీవాసుల నుంచి సమగ్ర నివేదికలను తీసుకున్నట్లు తెలిపారు. రోడ్లకు మొరం వేయడంతో పాటు మురికి కాలువల క్లీనింగ్ చేయించామని తెలిపారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు ఇంకా పట్టాలు రాలేదని వెంటనే ఇప్పించాలని కాలనీవాసులు కోరడంతో కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. చెత్తను రోడ్డుపై వేయవద్దని కాలనీవాసులకు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్ జహీరాభేగం, యామిన్, పాత శివకృష్ణమూర్తి, చాట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన గంగమ్మవాగు బ్రిడ్జి పనులు

- వర్షంతో తెగిపోయిన తాత్కాలిక రోడ్డు

రామారెడ్డి, జూలై 31: రామారెడ్డి మండలంలో గంగమ్మవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు నామ మాత్రంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు తెగిపోయింది. రోడ్డు పనులకు కోటి పది లక్షల రూపాయల నిధులు కేటాయించినప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేమితో పనులు నత్తనడకన సాగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో పోలీసులు అటువైపుగా ప్రయాణం చేయకుండా వాహనాలను అడ్డుగా ఉంచారు.


వరద నీటితో తెగిపోయిన తాత్కాలిక రోడ్డు
నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి ఎక్కి పొలాలకు వెళ్తున్న రైతులు

వన మహోత్సవంలో 26 లక్షల మొక్కలు నాటుతాం

జడ్పీ సీఈవో చందర్ నాయక్


నల్లమడుగులో మొక్కలు నాటుతున్న జడ్పీ సీఈవో

లింగంపేట, జూలై 31: కామారెడ్డి జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా మొత్తం 26 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండలంలోని నల్లమడుగులో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 17.88లక్షల మొక్కలు, అటవీశాఖ ఆధ్వర్యంలో 8.12లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటి వరకు 14.50 లక్షల మొక్కలు నాటినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని ఆయన అధికారులకు సూచించారు. పల్లె ప్రకృతి వనాల్లోని ఖాళీ ప్రదేశాల్లోను, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, హరిత వనాలలో మొక్కలు నాటాలని ఆయన తెలియజేశారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి లక్ష్యం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నా మని తెలియజేశారు. లింగంపేట మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాచీన కట్టడం నాగన్న బావిని పరిశీలించి ఎల్లారెడ్డి - కామారెడ్డి రహదారి నుంచి నాగన్న బావి వరకు ఉపాధిహామీ పథకంలో ఫార్మేషన్ రోడ్డును వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి, ఎంపీఎం శ్రీనివాస్, ఏపీఎం అన్నపూర్ణతో పాటు సిబ్బంది ఉన్నారు.



మత్తు పదార్థాలపై కొరడా

- రెండు శాఖల ఆధ్వర్యంలో నిత్యం దాడులు, తనిఖీలు
- పెద్దఎత్తున గంజాయి, అల్ప్రాజోలం పట్టివేత
- పలువురి అరెస్టు

భిక్కనూరు, జూలై 31: ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై జిల్లా ఎక్సైజ్, పోలీసు అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఏ చిన్న సమాచారం అందినా, అనుమానం వచ్చినా మాటు వేసి నిందితులను పట్టుకుంటున్నారు. గంజాయి, నిషేధిత గుట్కా, గుడుంబా, అల్ప్రాజోలంతో పాటుగా ఇతర నిషేధిత మత్తు పదార్థాలపై, వాటిని విక్రయించేవారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గంజాయి, గుట్కా, ఇతర మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే నష్టాలపై పోలీసులు, ఎక్సైజ్‌శాఖ విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గత కొన్ని నెలలుగా జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, నిషేధిత గుట్కా, అక్రమ మద్యం నివారణకు వాహనాలు, దాబాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. ఈజీ మనీకి అలవాటు పడిన పలువురు జిల్లాను ఆనుకుని ఉన్న మహారాష్ట్రతో పాటుగా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి ఎక్కువగా ఈ గంజాయిని తీసుకువచ్చి అమాయకులైనా యువకులకు అలవాటు చేస్తున్నట్లు సమాచారం. గంజాయిని విక్రయించే వారు జిల్లాలోని పలు ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని ఈ దందాను కొనసాగిస్తుండగా ఎక్సైజ్, పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా పెట్టి వారిని పట్టుకుని భరతం పడుతున్నారు.

నిత్యం దాడులు, తనిఖీలు

కామారెడ్డి జిల్లాకు మహారాష్ట్ర కూతవేటు దూరంలో ఉండటంతో సునాయసంగా జిల్లాలోకి ఈ మత్తు పదార్థాలను తీసుకువచ్చి అమాయకులైనా యువకులను టార్గెట్ చేసుకుని విక్రయదారులు దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. కానీ వీరి ఆటలను కట్టిస్తూ జిల్లాను మత్తు రహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆయా శాఖల వారీగా ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ గంజాయి, నిషేధిత గుట్కా, అక్రమ మద్యం విక్రయదారులకు చుక్కలు చూపిస్తున్నారు. వాహనాలు, దాబాలు, కల్లు దుకాణాలు, హోటళ్లు, టీ పాయింట్లు, ఇతర అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు.

మత్తు పదార్థాల రవాణాపై నిఘా ఉంచాం

జిల్లాలో మత్తుపదార్థాల రవాణాపై నిఘా ఉంచాం. తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిరంతరంగా తనిఖీలు చేపడుతూ ఎప్పటికప్పుడూ మత్తు పదార్థాలు, నిషేధిత గుట్కా, తదితర వాటిపై సమాచారాలను సేకరించి దాడులు చేస్తున్నాం. ఇప్పటి వరకు అల్ప్రాజోలం, గంజాయి, నిషేధిత గుట్కాలను పట్టుకోవడంతో పాటుగా క్రయ, విక్రయదారులను అరెస్టు చేయడం జరిగింది.

- తిరుపయ్య, సీఐ టాస్క్‌ఫోర్స్

పట్టుబడుతున్న గంజాయి, అల్ప్రాజోలం, గుట్కాలు

ఇటీవల జిల్లాలో పెద్దఎత్తున గంజాయి, అల్ప్రాజోలం, డైజోఫాం, నిషేధిత గుట్కా, అక్రమ మద్యం పెద్దఎత్తున పట్టుబడుతుంది. జనవరి 2024 నుంచి ఇప్పటి వరకు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నిరంతరంగా తనిఖీలు, దాడులు కొనసాగిస్తుండగా మొత్తంగా 12 కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్టు చేశారు. 12 కేసుల్లో పట్టుబడిన వారి వద్ద నుంచి గంజాయి 5.49 కిలోలు, అల్ప్రాజోలం 6.450కిలోలు, డైజోఫాం 460 గ్రాములతో పాటుగా అక్రమ మద్యాన్ని పెద్దఎత్తున పట్టుకున్నారు.

మత్తు రహిత జిల్లాగా చేయడమే లక్ష్యం

జిల్లాను మత్తు రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందుకు సాగుతున్నాం. జిల్లాలో గంజాయి, అల్ప్రాజోలంతో పాటుగా నిషేధిత గుట్కా తదితర వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగింది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో సైతం మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది.

- శ్రీనివాస్, సీఐ సీసీఎస్

పోలీసుశాఖ ఆధ్వర్యంలో...

పోలీసు శాఖ(టాస్క్‌ఫోర్స్, సీసీఎస్) ఆధ్వర్యంలో నిత్యం నిషేధిత మత్తు పదార్థాలు, గుట్కా, తదితర వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఏ చిన్న సమాచారం అందినా మాటు వేసి నిందితులను పట్టుకుంటు మత్తు పదార్థాలు, నిషేధిత గుట్కాలు విక్రయించేవారి గుండెల్లో రైల్లు పరుగెత్తిస్తున్నారు. ఇప్పటి వరకు గత జనవరి నుంచి 11 కేసులు నమోదు చేసి 46 మందిని అరెస్టు చేశారు. ఇందులో 7 గంజాయి, 3 అల్ప్రాజోలం కేసులు ఉన్నాయి. ఇది కాకుండా పోలీసులు జిల్లావ్యాప్తంగా దుకాణాలు, పాన్‌షాప్‌లపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ నిషేధిత గుట్కాను పెద్దఎత్తున పట్టుకుంటూ విక్రయదారులపై కేసులు నమోదు చేస్తున్నారు.

సినిమా స్టైల్‌లో చేజింగ్‌లు

జిల్లాను మత్తురహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్, పోలీసు సిబ్బంది ఏ సాహసానికైనా రెడీ అన్నట్లు ముందుకు సాగుతున్నారు. మత్తు పదార్థాలపై ఏ చిన్న సమాచారం వచ్చినా వెంటనే అక్కడికి చేరుకుని మాటు వేసి క్రయ, విక్రయదారులను పట్టుకుంటున్నారు. చాలా సందర్భాల్లో పోలీసులను పసిగట్టి మత్తుపదార్థాల క్రయ, విక్రయదారులు పారిపోయిన సంఘటనలు ఉండగా వారిని సినిమా స్టైల్‌లో చేజింగ్ చేసి వారి భరతం పడుతున్నారు.



నిజామాబాద్ జిల్లా మత్స్యశాఖాధికారిగా ఆంజనేయస్వామి నియామకం



నిజామాబాద్ రూరల్, జూలై 31 : జిల్లా మత్స్యశాఖ అధికారిగా ఆంజనేయస్వామి బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం ఎఫ్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయస్వామి బదిలీపై జిల్లాకు వచ్చారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారిగా విధులు నిర్వహించిన రాజనర్సింహను ఖమ్మం జిల్లాకు బదిలీచేశారు. ఆంజనేయస్వామి గతంలో ఎఫ్‌డీవోగా రెండేళ్లు విధులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లి మత్స్యశాఖ కార్యాలయ భూములను కాపాడటంలో ప్రధానపాత్ర పోషించారు. ఫిషరీష్ డెవలప్‌మెంట్ లాండ్ కబ్జాదారులపై హైకోర్టులో కేసువేశారు.

ప్రమాదకరంగా మారిన నాగన్‌పల్లి బ్రిడ్జి

● శిథిలావస్థలో బ్రిడ్జి ● బ్రిడ్జి సైడ్‌వాల్స్ కూలి వాహనదారులకు ఇబ్బందులు



బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు



బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పడిన గుంతల్లోనే ప్రయాణాలు చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై31: బోధన్ పట్టణ సరిహద్దు నాగన్‌పల్లి బ్రిడ్జిపై, ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడ్డాయి. నాగన్‌పల్లి బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి శిథిలావస్థ దశకు చేరినట్లయింది. బ్రిడ్జి కింద, పైనుండి వర్షపు నీరు పారింది. బ్రిడ్జిపై ఉన్న సైడ్‌వాల్స్ కొన్ని కూలిపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. బ్రిడ్జికి బోధన్ వైపు, నాగన్‌పల్లి వైపు ప్రధానంగా పెద్ద గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు నిలిచి గుంతలు కనబడక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరుచు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నాగన్‌పల్లి వాసులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద గుంతలు ఏర్పడ్డ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. తక్షణమే బ్రిడ్జిపై, బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రిపూట సాలూర, మహారాష్ట్ర వైపు వెళ్లేవారు గుంతల లోతు తెలియక గుంతల్లో పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రిపూట తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నాగన్‌పల్లి వాసులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు కాలక్షేపం చేయకుండా బ్రిడ్జిపై ఉన్న గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బోధన్ నుంచి సాలూర వెళ్లాలంటే భయంగా ఉంది



బోధన్ పట్టణం నుండి ఇటీవల కురిసిన వర్షలతో నాగన్‌పల్లి బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతల వల్ల తమ స్వగ్రామం సాలూర వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను మొరం, కంకర పౌడర్‌తో నింపకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైన అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలి.

-పాండు, సాలూర గ్రామస్థుడు

బ్రిడ్జిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలి



నాగన్‌పల్లి బ్రిడ్జిపై, రోడ్డుకు ఇరువైపులా ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలి. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి. లేనట్లయితే ఆందోళన చేపడతాం

- వరదయ్య, వాహనదారుడు,బోధన్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వినతి



పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోటగిరి,జూలై31: పొతంగల్ మంజీర నది నుంచి ఇసుక రవాణా అక్రమ రవాణాను అరికట్టాలని రైతులు డిమాండ్ చేశారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సాయిలు బుధవారం ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. మంజీర నది నుంచి రాత్రి, పగలు తేడా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని రైతులు ఆరోపించారు. రాత్రివేళ లారీలు, టిప్పర్‌లతో ఇసుకను తరలిస్తున్నారని పేర్కొన్నారు. పొతంగల్ మంజీర నది నుంచి మహారాష్ట్రకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు దెబ్బతింటున్నాయని ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పవన్, మాణిక్ అప్ప,బండారి గంగారాం, మనోహ్మన్ దేశాయ్,విఠల్, దత్తు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విరాధ్య విశ్వం చిత్ర టైటిల్ పోస్టర్ల ఆవిష్కరణ



చిత్రం షూటింగ్‌లోని దృశ్యం

బోధన్‌రూరల్,జూలై31: టీఎస్‌ఆర్ ఆర్ట్స్ ప్రొడక్షన్, క్రియేటివ్ డ్రీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న విరాధ్య విశ్వం ఇండిపెండెంట్ చిత్ర టైటిల్ పోస్టర్లను చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం సాలంపాడ్ క్యాంప్‌లో ఆవిష్కరించారు. ఈ సినిమాకు సాలంపాడ్ క్యాంప్ గ్రామానికి చెందిన తూము నవీన్ రెడ్డి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమలేష్, దీపారాథోడ్‌తో పాటు కిరణ్ దాచేపల్లి, అకివీడు శివ తదితరులు చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సన్నీ మెల్చిజెడెక్ సంగీతం అందించారు. కొత్త కదాంశంతో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అతి త్వరలో ఓటీటీలో విడుదల చేస్తున్నట్లు దర్శకుడు నవీన్ రెడ్డి తెలిపారు. నిర్మాతలుగా తూము విష్ణువర్ధన్ రెడ్డి, యడ్ల నిరంజన్ రెడ్డి, బిజ్జం విష్ణువర్ధన్ రెడ్డి, వీరంరెడ్డి అశోక్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీహర్ష, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌నగర్ గ్రామస్థుల ధర్నా

కమ్మర్‌పల్లి, జూలై 31: మండంలోని అమీర్‌నగర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 73 లో ని అసైండ్ భూముల్లో స్థానికులకు (గత కొంతకాలంగా కబ్జాలో ఉన్న) కాకుండా అప్పటి అధికారులు స్థానికేతరులకు పట్టాలు ఇవ్వడం పట్ల ఆగ్రహంవ్యక్తం చేసిన గ్రామస్తులు పట్టాలు రద్దుచేయాలని డిమాండ్ చేస్తు కమ్మర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంముందు బైటాయించి ధర్నా చేపట్టారు. 73 సర్వే నెంబర్‌లోని అసైండ్ భూమిలో తమ గ్రామస్తులు గత 30 సంవత్సరాలుగా ఐదుగురు రైతులు కబ్జాలో ఉండి వ్యవసాయం చసుకుటున్నారని ఈదే సర్వే నెంబర్‌లోగల కొంత భూమి శివగుట్ట శివాలయం ఆధినంలో ఉండగా దానిపై వచ్చే ఆదా యాన్ని శివాలయానికి వినియోగిస్తున్నామన్నారు. ఈ విషయమై ఆర్మూర్ ఆర్డీవో కు వినతిపత్రాన్ని అందచేశారు. గతంలో జారి చేసిన పట్టాలు రద్దుచేయడం కుదరదని భూమివిషయమై పరస్పరం కోర్టుకు వెళ్లినందున తామేమి చేయలేమని ఇంజక్షన్ ఆర్డర్‌తెచ్చుకోవాలని ఆర్డీవో అన్నారు. అంతకుముందు తహసీల్దార్ అంజనేయులుతో గ్రామస్తులు వాదనకు దిగారు.

మోతెలో 235మంది విద్యార్థులకు షూల వితరణ

వేల్పూర్, జూలై31: వేల్పూర్ మండలం మోతె గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 235మంది విద్యార్థులకు షూలను ఇదే గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి ఎస్‌బీఐ కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్‌గా విధులు ఇస్సాపల్లి రవి వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డొల్ల రాజేశ్వర్, రవి ఆయన స్నేహితుల చేతుల మీదుగా విద్యార్థులకు 235జతల షూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైద్య గణేష్, ఉపాధ్యాయులు రత్నయ్య, శ్రావణశ్రీ, కవిత,మంచిర్యాల సురేష్‌కుమార్, విద్యార్థులు, ఉన్నారు

తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల సన్మానం

ఏర్గట్ల, జూలై 31: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవలే బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీలతను మండలంలోని రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిట్ల మీనా నరేష్, రహమాన్, అశోక్, శ్రీనివాస్, గంగాధర్, గంగశంకర్, మనసిని, రమారాణి అరుణలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ముప్కాల్, జూలై31: తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష 50వేల రుణమాఫీ నేరుగా రైతు ఖాతాల్లో జమ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రైతు రుణమాఫీ హామీ నెరవేరడంతో బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఎస్సీకాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, రుణమాఫీ లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు అభివృద్ధి చేయడానికి మరిన్ని సంక్షేమ పథకాలు సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా రూ.2లక్షల రుణమాఫీ జరుగుతుందని కాం గ్రెస్ పార్టీ టౌన్ ఇన్‌ఛార్జీ ముస్కు మోహన్ అన్నారు. ఈకార్యక్రమంలో మాజీసర్పంచ్ కాంగ్రెస్ నాయకులు కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి రాజు, ముస్కుముత్తెన్న, ప్రశాంత్, మల్లారెడ్డి, సదా, గద్దల గంగాధర్, లాలయ్య, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను నిర్వహించాలి

ముప్కాల్, జూలై31: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య పనులను నిరంతరం సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో మహమ్మద్‌గౌస్ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, తదితర ప్రాంతాలను పరిశీలించారు. పంచాయతీ రిజిష్టర్‌లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమలో నల్లూర్ సెక్రెటరీ విగ్నేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

వీక్లీ మార్కెట్ శుభ్రతకు చర్యలు

వర్ని,జూలై31: వర్ని మండల కేంద్రంలో బుధవారం వారంతపు సంత శుభ్రతకు అధికారులు చర్యలు చేపట్టారు. సంత ఆవరణ అపరిశుభ్రంగా మారడంతో ఎంపీవో మారుతీ, కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు. బురదను తొలగించి పిచ్చి మొక్కలను ఏరివేశారు. వచ్చే వారం తపు సంతలోగా పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టినట్లు ఎంపీవో మారుతీ తెలిపారు.

వనమహోత్సంలో మొక్కలు నాటిన ఎస్సై

ఏర్గట్ల,జూలై 31:వనమహోత్సంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని హయగ్రీవ పాఠశాలలో ఎస్సై మచ్చేందర్ రెడ్డి మెక్కలు నాటారు.ఈసందర్భంగా పాఠశాలలో వన మహోత్స వం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సెక్రటరీ, కరస్పాండెంట్ అలి వేణి తెలిపారు.ఈకార్యక్రమంలోఉపాధ్యాయలు,విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

ఎడపల్లి, జూలై31: ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని రామాలయంలో, బాపూనగర్ గ్రామంలోని సాయిబాబా అలయాలలో మంగళవారం రాత్రి వరుస చోరీలు జరిగినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని రామాలయంలో, బాపూనగర్ గ్రామంలోని సాయిబాబా ఆలయాలకు ఉదయం పూజారిలు వెళ్లి చూసేసరికి ఆలయాలలోని హుండీలు పగుల గొట్టి ఉండడంతో వారు గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాలకు చేరుకుని, క్లూస్‌టీంద్వారా వివరాలను సేకరించారు. ఏఆర్పీ గ్రామంలోని రామాలయంలో రెండు వేల నగదు, బాపూనగర్ సాయిబాబా ఆలయంలో మూడు వేల నగదుతో పాటు వెండి వస్తువులను దొంగలు దొంగిలించినట్లు ఆయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'అరకొర జీతాలతో పస్తులుంటున్నాం'

ఆర్మూర్‌టౌన్ జూలై31: సంచార పశువైద్య వాహనసేవలో అందించే సిబ్బంది అరకొర జీతాలతో పస్తులు ఉంటున్నామని డాక్టర్ కాంతయ్య, అరుణ్‌కుమార్, డ్రైవర్ ప్రేమ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకిత భావంతో 1962సంచార పశువైద్య వాహన సేవలో సేవలందిస్తున్న తమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పని చేస్తున్న వైద్యులకు రూ.35వేలు, అసిస్టెంట్‌కు రూ.14వేలు, డ్రైవర్‌కు రూ.8వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వైద్యునికి రూ.56 వేలు, అసిస్టెంట్ రూ.20వేలు, డ్రైవ్‌కు రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతీసంవత్సరం పది శాతం ఇంక్రి మెంట్లు ఇవ్వడంలేదని, గత రెండు నెలలుగా జీతాలు సైతం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

నవీపేట,జూలై31: గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో నాగనాథ్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల గుంతలలో నీరు నిలిచి ఉన్నాయని వెంటనే అటువంటి వాటిని తొలగించాలని సూచించారు. వన మహోత్సవం సందర్భంగా ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నవీపేట,జూలై31: మండల కేంద్రానికి చెందిన 17సంవత్సరాల బాలిక అదృశ్యమైందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల హస్టల్‌కు బుధవారం ఉదయం వెళ్లాల్సి ఉండగా బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవీపేటలో ఒకరి ఆత్మహత్యా యత్నం

నవీపేట,జూలై31: మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య యత్నానికి యత్నించాడు. నాలుగు మాసాల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు తన 17సంవత్సరాల కూతురును కిడ్నాప్ చేయడంతో అతనిపై ఫోక్సో కేసు నమోదు అయిందని అన్నారు. ఈ విషయంలో తమ కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన న్యాయం చేయాలని కోరుతూ ఆయన రైలు పట్టాలపై పడుకున్నాడు. దీంతో పోలీసులు అతనికి నచ్చజెప్పడంతో శాంతించాడు.

టీచర్‌ని సస్పెండ్ చేయడం హేయమైన చర్య

ముప్కాల్,జూలై31:ఇటీవల ఖమ్మం జిల్లాలో శిరీష అనే ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం హేయమైన చర్యలని తాపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల తలవెంట్రుకలు, వేషాధారణ సరిగ్గా లేదని గమనించిన ఉపాధ్యాయురాలు అనేక మార్లు మందలించిన వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యార్థులను సంస్కరించే ప్రయత్నంలో భాగంగా హెయిర్ కాటింగ్ చేయించిన కారణంగా శిరీష అనే ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడాన్ని ప్రతీ ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉంది. రోజు రోజు విద్యార్థుల్లో పెరుగుతున్న దురలవాట్లు, నిర్లక్ష్య వైఖరి వల్ల భావి సమాజం, క్రమ శిక్షణరాహిత్యమవుతుందన్నారు.అంకితభావం, తత్పరత కలిగి బావి సమాజాన్ని సంస్కరించాలనే విశాల దృక్పధంతో ముందుకు వెళ్లి సీఎంచే ప్రశంసాలు అందుకున్న ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యంపై మీద దెబ్బతీయడం అత్యంత అమానుషచర్య కబట్టి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా శిరీష ఉపాధ్యాయురాలిని సస్పెండ్ ఎత్తివేసి గౌరవ ప్రధంగా విధుల్లో చేర్చుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

గాయపడ్డ వ్యక్తికి 25వేల జరిమాన ఇవ్వాలని తీర్పు

● బోధన్ కోర్టు అసిస్టెంట్ సెషన్ న్యాయాధికారి దేవన్ అజయ్‌కుమార్ వెల్లడి

బోధన్‌రూరల్,జూలై31: బోధన్ కోర్టులో బుధవారం దాడి కేసులో గాయపడ్డ వ్యక్తికి రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని బోధన్ కోర్టు అసిస్టెంట్ సెషన్ న్యాయాధికారి దేవన్ అజయ్‌కుమార్ తీర్పు వెల్లడించారు. కోర్టు పోలీసులు తెలిపిన వివరాలప్రకారం కోటగిరి మండలం కారేగాం గ్రామానికి చెందిన యాదవరావు, రమేష్ అనే ఇద్దరు కుటుంబాల పిల్లలు గొడవ పడగా అది పెద్దదై 12-11-2023నాడు రమేష్ అనే వ్యక్తి యాదవరావు అనే వ్యక్తికి దాడికి యత్నించాడని ఫిర్యాదులో పేర్కొనగా పోలీసుల తరపున డాక్టర్ సమ్మయ్య బుధవారం విచారణ పూర్తిచేశాడు. ఈసందర్భంగా దాడికి పాల్పడిన వ్యక్తి గాయపడిన వ్యక్తికి రూ.25వేల నష్టపరిహారం అందించాలని కోర్టు తీర్పులో వెల్లడించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సందీప్, రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, బోధన్ కోర్టు లైజింగ్ అధికారి శంకర్, బాకర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోటగిరి,జూలై31: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు దుబాస్ రాములు డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఏఐఈయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడితే ఏఐటీయూసీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ నాయకులు విఠల్‌గౌడ్, అలీ, వీరేశం, ఉషా, సరిత, సత్యావతి, నాగమణి, రమణమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్ ,జూలై31: మున్సిపల్ పరిధిలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్‌లలో బుధవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించిఅలాగే హోటళ్లలో పట్టుబడ్డ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.12వేల 500జరిమానాను విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది అక్షయ్, నరేష్, సంతోష్, తదితరులు పలాఖ్గన్నారు.

భీమ్‌గల్‌లో భారీ చోరీ

భీమ్‌గల్ రూరల్, జూలై31: భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి బోయి గల్లీలో భారీ దొంగతనం జరిగింది. పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ రియల్ ఏస్టేట్ వ్యాపారి పోత్వాల శ్రీనివాస్ ఇంట్లో అర్ధరాత్రి దొంగలు చొరబడి సుమారు ముడున్నర తులాల బంగారం, 45తులాల వెండిని దొంగతనం చేశారు. గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలను పగులగొట్ట అందులోని బంగారాన్ని,వెండిని దొంగిలించారు.చోరీకి పాల్పడ్డ వ్యక్తులు చాకచక్యంగా చుట్టు పక్కల ఇంటి పరసర ప్రాంతాల ఇళ్లకు ఉన్న గొళ్లెలను పెట్టి మూసి వేశారు. అనంతరం ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారు. ఉదయం6గంటల ప్రాంతంలో ఇంటి యాజమాని శ్రీనివాస్ బయటకు వచ్చి చూడగా పక్కగదిలోని ఇంటి తాళలు పగులగొట్టి ఉండడం గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే పోలీసులు క్లూస్‌టీంను తర్పించారు. క్లూస్‌టీం బృందం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్సై హరిబాబు తెలిపారు.

పాఠశాల ఆవరణంలో పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలపై గడ్డి మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

మోస్రా,జూలై31: పాఠశాలలో పలు సమస్యలపై బుధవారం ప్రచురించిన మోస్రా మండల పాఠశాలల్లో సమస్యలెన్నో కథనానికి అధికారులు స్పందించి పాఠశాలల్లో మురికి కాలువలను శుభ్రం చేశారు. చింతకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో పిచ్చి మొక్కలకు గడ్డిమందు కొట్టారు. పిట్ల గంగాధర్ కాలనీ పాఠశాల వద్ద ముందు ఉన్న మురికి కాలువలు నీరు నిలవకుండా కాలువ తీశారు. కానీ పాఠశాల వెనుకల ఉన్న డ్రైనేజీ పిచ్చి మొక్కలు కానీ శుభ్రం చేయలేదు. వాటిని గురువారం నాడు జేసీబీ సహాయంతో శుభ్రం చేస్తామని ఎంపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది కాశీరామ్, శ్రావణ్, జిన్నా రాము, గ్రామ పంచాయతీ సఫాయి సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, శోభాబాయి పాఠశాలలో శుభ్రం చేయడంతో చాలా సంతోషంగా ఉంది. మట్టి కుప్పలు, చెత్త, పిచ్చి మొక్కలు తొలగించడంతో పాఠశాల వాతావరణం శుభ్రంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

డిచ్‌పల్లి,జూలై 31: మండలంలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ నెల 1నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అండన్‌వాడీ సూపర్ వైజర్ బుజ్జి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చే చిన్నారులకు తల్లి పాల వారోత్సవాల పట్ల కలిగే లాభాలపై తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వర్తించి లక్ష్యాలను గర్భిణులకు వివరించాలన్నారు.

రుద్రూరు: మండలంలో నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు జరగనున్నట్లు సూపర్ వైజర్ శ్రీలత తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వారోత్సవాలకు సంబంధించిన కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ తెలిపారు.

రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

● ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, జూలై 31 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ రైతులకు రుణమాఫీపై ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొదటి విడతలో రూ. లక్ష వరకు 17231 మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, రెండోవిడత 1.50 లక్షల లోపు 7497 మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. రైతులు సంబరాలు జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. అదే విధంగా రెండు లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు ఆగస్టు 15వ తేది లోపే మూడోవిడత రైతు రుణమాఫీ అవుతుందన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, దేశంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రైతు రుణమాఫీచేస్తుందన్నారు. ఎవరికైనా రైతులకు రుణమాఫీ కాని యెడల తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

● నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తలసేమియా సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం గురువారం ఉదయం 10 గంటలకు ఉంటుందని క్యాంపు కార్యాలయం సిబ్బంది తెలిపారు. రక్తదానం చేసే వారి పేర్లు ఫోన్‌నెంబర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



అంబులెన్స్‌లో మహిళ, బిడ్డ

నాగిరెడ్డిపేట, జూలై 31 : పురిటి నొప్పులతో గర్భిణీ స్త్రీ 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి వెళుతుండగా మార్గమధ్యంలోనే ప్రసవించిన ఘటన బుధవారం తెల్లవారుజామున కామారెడ్డి జిల్లాలోని గాలిపూర్ వద్ద చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి భవానికి బుధవారం తెల్ల వారుజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబు లెన్స్‌కు ఫోన్‌చేశారు. 108 సిబ్బంది జలాల్‌పూర్ గ్రామానికి చేరుకుని గర్భిణిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు అందు బాటు లోలేరని తెలిసింది. దీంతో ఆమెను బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకె ళుతుండగా మార్గమధ్యన నిజాంసాగర్ మండలం గాలిపూర్ వద్ద ఆమె ప్రసవించింది. అంబులెన్స్ సిబ్బంది ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డను జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లి బిడ్డలను బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. అంబులెన్స్ ఈఎంటీ సత్యం, పైలట్ అబ్దుల్ మోహిన్‌లను అభినందించారు.

బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

బాన్సువాడ , జూలై 31 : జిల్లా ఎస్పీ సీహెచ్. సింధుశర్మ బుధవారం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. 100కు ఫోన్ రాగానే స్పందించి ఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నివారణా చర్యలు చేపట్టాలని తెలిపారు. బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ , రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్ ఉన్నారు.

బోరుమోటార్ ప్రారంభం

కామారెడ్డిటౌన్, జూలై 31 : 23వ వార్డులో బోరుమోటార్‌ను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు నీటికష్టాలు తీర్చాలనే ఉద్దేశంతో బోరు వేయించి నీటిని అందించేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తేజపుమానస ప్రసాద్, పాతశివకృష్ణమూర్తి, చాట్లవంశీ, రవీందర్‌గౌడ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

'డబుల్' లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

బీర్కూర్, జూలై 31 : మండలంలోని తిమ్మాపూర్‌లో డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు చెక్కులు పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు డబుల్‌బెడ్ రూమ్‌లను నిర్మించుకున్నారు. అనంతరం రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరింది. బిల్లులు వస్తాయో రావోనని గృహనిర్మాణ లబ్దిదారులు భయాందోళనకు గురయ్యారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం బిల్లులను మంజూరు చేసింది. బిల్లులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రామారెడ్డి, జూలై 31 : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్‌ఫోన్‌లలో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, సుభాషిణి,హెడ్‌కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

పదోన్నతులు పొందిన అధ్యాపకులకు సన్మానం

సదాశివనగర్, జూలై 31 : సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేస్తున్న దాత్రిక వెంకటేశ్వర్‌రావు, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ చంద్రికలు పదోన్నతులు పొందారు. బుధవారం వైస్‌ప్రిన్స్‌పాల్ ఉదయిని, అకాడమిక్ కో-ఆర్డినేటర్ వనజ, అధ్యాపక బృందం సన్మానించి, వీడ్కోలు పలికారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

బీర్కూర్, జూలై 31 : అనారోగ్యసమస్యలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స చేసుకున్న బాధితులకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చేసుకున్న బాధితులకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేసింది. బీర్కూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన బాధితులకు బుధవారం సీఎంఆర్ రీలిఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, వెంకన్న పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్ : బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్ లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్ , ఉదయ్ , రఫీక్ తదితరులున్నారు.

హత్యకేసులో నిందితుడి రిమాండ్

బిచ్కుంద, జూలై 31 : మద్నూర్ మండలంలో జూలై 20వ తేదీన జరిగిన హత్యకేసులో నిందితుడైన సాయిలును రిమాండ్‌కు తరలించినట్లు బిచ్కుంద సీఐ నరేష్ తెలిపారు. జూలై 20న ఇక్బాల్‌మోహాకు చెందిన లక్ష్మన్‌కొండ బ్యాంకులో రుణమాఫీ డబ్బులు చూసి వస్తానని వెళ్లి సలబాత్‌పూర్ వద్ద అనుమానాస్పదంగా మృతిచెందారు. అశోక్ ఫిర్యాదు మేరకు మద్నూర్ పోలీసుస్టేషన్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. తాగుడుకు బానిసైన నిందితుడు సాయిలు లక్ష్మన్‌గొండ వద్ద రూ.1000 దొంగలించి పారిపోతుండగా పోలీసులకు చెబుతానని లక్ష్మన్ అరవడంతో సాయిలు బండరాయితో కొట్టి చంపాడన్నారు. మద్నూర్ పోలీసులతో కలిసి సమగ్ర విచారణ జరిపి అదుపులోకి తీసుకుని విచారించి రిమాండ్‌కు తరలించడం జరిగిందని బిచ్కుంద సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లింగంపేట, జూలై 31 : మండలంలోని గాంధీనగర్ వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొనగా బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. లింగంపేట నుంచి కామారెడ్డికి వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు కామారెడ్డి నుంచి లింగంపేట వైపు వెళుతున్న బైక్ ఢీ కొనడంతో పొల్కంపేటకు చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పొల్కంపేటకు చెందిన చాకలి భూమయ్య, చాకలి నరేందర్‌లకు గాయాలు కాగా వారిని 108లో కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించిన ఆర్డీవో

నసురుల్లాబాద్, జూలై 31 : మండల ప్రజల సౌకర్యాల కోసం ప్రభుత్వం నిర్మించిన మండల సమీకృత భవనంను బుధవారం నసురుల్లాబాద్ మండల కార్యాలయం, సొసైటీ కార్యాలయం నుంచి మండల సమీకృత భవనంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆర్డీవో పాల్గొని నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

మద్నూర్, జూలై 31 : మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో రైతులు పండిస్తున్న పంటలను బిచ్కుంద ఏడీఏ ప్రసన్నకుమారి బుధవారం పరిశీలించారు. ఖరీఫ్‌లో రైతులు పండిస్తున్న పంటలు బాగున్నాయని వాటికి సంబంధించిన ఎటువంటి సలహాలు, సూచనలు కావాల్సిన గ్రామీణ ప్రాంతాలలో ఉండే ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణా తరగతులు

భిక్కనూరు, జూలై 31 : మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. బుధవారం రిసోర్స్ పర్సన్లు గోపికృష్ణ, సురేందర్, సంధ్య ఉపాధ్యాయులకు ఎన్ఏఎస్ సర్వే, విద్యా ప్రమాణాల పెంపుపై ఉపాధ్యాయులు నిర్వహించాల్సిన తరగతి గది బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భిక్కనూరు ఎంఈవో ఎల్లయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం రాజగంగారెడ్డి, నోడల్ అధికారి శ్రీనాథ్, సీఆర్పీలు ఈశ్వర్, సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

దోమకొండ ఎంపీడీవోగా ప్రవీణ్‌కుమార్

దోమకొండ, జూలై 31 : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో రమేష్ బుధవారం పదవీ విరమణ చేయడంతో ప్రవీణ్ కుమార్ ఇంచార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మానిక్‌రావ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆపరేటర్లు శ్రీకాంత్, అంకిత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి'

కామారెడ్డిటౌన్, జూలై 31 : పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కర్షక్‌బీఈడీ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్‌లను నియమించాలని, ఈహెచ్ఎస్ నగదు రహిత వైద్యసదుపాయం, సీపీఎస్ రద్దు ఓపీఎస్ పునరుద్ధరించాలని అన్నారు.

ఎంపీడీవో పర్బన్న సేవలు అభినందనీయం

● జడ్పీ సీఈవో చందర్ నాయక్

నాగిరెడ్డిపేట, జూలై 31 : నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్బన్న మండల ప్రజలకు అందించిన సేవలు ఎంతో ప్రశంసనీయమని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ అన్నారు. ఎంపీడీవో పర్బన్న బుధవారం పదవీ విరమణ చేయడంతో ఆయన పదవీ విరమణ కార్యక్రమానికి జడ్పీ సీఈవో చందర్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని పర్బన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రాజ్‌దాస్, టేకులపల్లి వినీత, ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్, నాగిరెడ్డిపేట,ఎల్లారెడ్డి మండలాల ఎంపీవోలు ప్రభాకర్‌చారి, ప్రకాష్, మాజీ ఎంపీవో శ్రీనివాస్, వివిధ శాఖల మండల అధికారులు, మండల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

13.5 అడుగులకు చేరిన పోచారం నీటిమట్టం

నాగిరెడ్డిపేట, జూలై 31 : పోచారం ప్రాజెక్టు నీటిమట్టం 13.5 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం రోజు రోజుకు పెరుగుతుంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులోకి నీటిమట్టం పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 13.5 అడుగులు నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.840 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి బుధవారం ఉదయం 7170 క్యూసెకుల ఇన్ ఫ్లో రాగా, సాయంత్రానికి ఇన్ ఫ్లో 1881 క్యూసెక్కులకు తగ్గిందని ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

విజ్ఞాన్ పాఠశాలలో బోనాల ఉత్సవాలు

భిక్కనూరు, జూలై 31 : మండలకేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా బోనాలు తయారుచేసి డప్పుచప్పుళ్ల నడుమ మండలకేంద్రంలోని ప్రధానవీధుల గుండా ఊరేగించి అమ్మవారికి బోనాలు, నైవేద్యాలను సమర్పించారు. విద్యార్థుల పోతరాజుల వేషాధారణలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ మేరకు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో బోధనతో పాటుగా రాష్ట్ర, దేశ సంస్కృతులు, సంప్రదాయాలను నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

భిక్కనూరు, జూలై 31 : హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం క్యాంపస్‌లోని హాస్టల్‌ను వార్డెన్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వంటగదిలో సిబ్బంది తప్పకుండా తలకు క్యాప్, గ్లౌజ్‌లు ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల న్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించి వార్డెన్‌కు పలు సూచన లు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేత

దోమకొండ, జూలై 31: మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సమయంలో పాగొంటి పోషవ్వ అనే మహిళ పని చేస్తూ మరణించింది. ఆమె భర్త స్వామికి బుధవారం ఎంపీడీవో రమేష్ ప్రభుత్వం మంజూరైన రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో రజని, టీఏలు రాజేశ్వర్, లింగం, కే. అంజాగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆపరేటర్లు, పాల్గొన్నారు.

'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

రామారెడ్డి, జూలై 31 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్ర మత్తంగా ఉండాలని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్‌ఫోన్ లలో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, సోషల్‌మీడియాలో చెప్పిన ప్రతి అంశాన్ని ఫాలోఅవుతూ సైబర్‌నేరస్తుల భారిన పడవద్దని తెలి పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, సుభాషిణి, హెడ్‌కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూమ్ బిల్లులు ఇప్పించాలని వినతి

బీర్కూర్, జూలై 31 : బీర్కూర్‌లో రెండేళ్ల క్రితం డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించుకున్నామని, వెంటనే స్పందించి తమకు బిల్లులు ఇప్పించాలంటూ బాధితులు తహసీల్దార్‌లతను కోరారు. బుధవారం బీజేపీ నాయకులతో కలిసి బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ లతకు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో లబ్దిదారులు, నాయకులు యోగి, బీరుగొండ బస్వరాజ్, సాయిబాబాలు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో భారీ వర్షం

బీర్కూర్, జూలై 31 : భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి 40.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీవర్షం కురవడంతో పంట పొలాలు నీట మునిగాయి. రహదారులపై వరద నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్ళలోకి వర్షం నీరు చేరింది. గ్రామాల్లో పురాతన ఇళ్ళు దెబ్బతిన్నాయి.

జనావాసాల్లో అడవి పందుల సంచారం

లింగంపేట, జూలై 31 : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్, తహసీల్ కార్యాలయం ప్రాంతాల్లో అడవిపందులు సంచరిస్తున్నాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మండలకేంద్రంలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారి పక్కనవేయడంతో వాటి కోసం పందులు వస్తున్నాయని దీంతో రాత్రి వేళల్లో రహదారిపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు అంటున్నారు. అడవి పందులు ఇండ్ల మధ్యలోకి రావడంతో రాత్రి వేళల్లో ఇండ్లలోనుంచి బయటకు రావడానికి జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డుపై పారవేయవద్దని గ్రామస్తులు కోరుతున్నారు.

భిక్కనూరు ఆరోగ్యకేంద్రంలో కంటివైద్య శిబిరం

భిక్కనూరు, జూలై 31 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు రవీందర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి బుధవారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణీ యేమిమా, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి యువకుల ఆర్థిక సహాయం

భిక్కనూరు, జూలై 31 : మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన యువకులు బుధవారం నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడైనా నిరుపేద యూసుఫ్ కూతురికి ఇటీవల వివాహం నిశ్చయం అయింది. ఆమె వివాహానికి గ్రామానికి చెందిన యువకులు కలిసి డబ్బులు పోగు చేసి రూ.9వేలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యూసుఫ్ కూతురు వివాహ కార్యక్రమాల్లో గ్రామపెద్దలతో పాటుగా తామంతా పాలుపంచుకుంటామన్నారు. ఈ మేరకు గ్రామ యువకులకు యూసుఫ్ కృతజ్ఞతలు తెలిపారు. యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

దోమకొండ, జూలై 31: ప్రభుత్వ ఉద్యోగులు ఎంత పెద్ద స్థాయిలో ఉన్న పదవీ విరమణ తప్పనిసరి అని మండల స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం దోమకొండ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో రమేష్ పదవీ విరమణ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎలాంటి మచ్చ లేకుండా విధులు నిర్వహించి పదవీ విరమణ చేయడం గర్వకారణమన్నారు. దోమకొండ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఎంపీవో, తిరుపతి రెడ్డి,సుపరింటెండెంట్ యుగేందర్, సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మాజీ ఎంపీపీ కానుగంటి శారద, ఎంపీవో ప్రవీణ్ కుమార్, మనోహర్, శ్రీకాంత్, సిరిసిల్ల జిల్లా ఎంపీడీవో శ్రీనివాస్, సత్యం, ఈరిగేషన్ ఏఈ బాలక్రిష్ణా, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దేవాలయాల్లో దొంగతనం చేస్తున్న వ్యక్తి అరెస్టు

కామారెడ్డిటౌన్, జూలై 31 : పలు జిల్లాలో దేవాలయాలతో పాటు ఇతర ప్రదేశాలలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కామారెడ్డి పట్టణంలో ద్విచక్రవాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న చిల్ల గంగాదాస్ అనే వ్యక్తిని పట్టుకుని విచారించగా అతని వద్ద లక్ష్మీనరసింహ స్వామి పంచలోహ విగ్రహం, మూడుద్విచక్రవాహనాలు ఉన్నట్లు వెల్లడించాడని తెలిపారు. గంగదాసు పాతనేరస్తుడేనని ఒకరి హత్య కేసులో జైలుకు సైతం వెళ్లివచ్చాడని తెలిపారు. మేడ్చల్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు ద్విచక్రవాహనాలను, గంభీరావుపేట పోలీసుస్టేషన్, మాక్లూర్, గాంధారి, కామారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. గతంలో ఇతనిపై కేసులు నమోదు కాగా తప్పించుకుని తిరుగుతున్నాడని తెలిపారు. చోరీలకు పాల్పడుతున్న గంగాదాస్ వద్ద ఉన్న రూ.30 వేలను స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి జైలుకు తరలించామని సీఐ తెలిపారు.

లింగంపేటలో పెద్దవాగుకు జలకళ

లింగంపేట, జూలై 31 : మండల కేంద్రంలోని పెద్దవాగుకు జలకళ సంతరించుకుంది. నెలరోజులుగా ఎదురు చూస్తున్న రైతులకు సంతోషం కలిగింది. మంగళవారం రాత్రి గాంధారి మండలంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఒక్కసారిగా పెద్దవాగు ప్రవాహం ఉధృతంగా పెరిగింది. దీంతో లింగంపేట, ఐలాపూర్ చెరువులు కుంటలు నిండుకుంటాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	- ఓసీ	మహేశ్వరి	- రాయన్
దర్శన్	- డెడ్‌పూల్	వెంకటేశ్వర	- శివం భజే
ప్రియా 70	- కల్కి		
ప్రియా 70	- రాయన్		

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

